www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 18 | డిసెంబర్ | 2024
పేజీలు 7

కార్పోరేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

అసెంబ్లీలో ఎంఎల్ఎ కూనంనేని

ప్రజాపక్షం/కొత్తగూడెం : కొత్తగూడెం నియోజకవర్గం పరిధిలోని కొత్తగూడెం పాల్వంచ పట్టణాలు, పరిసర గ్రామాలను కలుపుతూ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలన్న తన ప్రతిపాదనపై ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు స్పీకర్ ను కోరారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెంపాల్వంచ పరిసర గ్రామాలను కలుపుతూ కార్పోరేషన్ ఏర్పాటుపై 1/70 చట్టం అడ్డుగా ఉందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. 1950 ప్రెషిడెన్షియల్ ఆర్డర్ పై గత పాలకులకు,

మిగతా 2లో..

పనిచేయండి.. లేదా సెలవులపై వెళ్లండి

-వైద్యుల గైర్హాజరుపై కలెక్టర్ ఆగ్రహం
-విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
-మంచుకొండ పిహెచ్‌సిని తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పనిచేయడం ఇష్టం లేకపోతే సెలవులపై వెళ్లాలని అనవసరంగా ప్రజలను ఇబ్బందులు పెట్టవద్దని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంచుకొండ పిహెచ్‌సిలో వైద్యులు, సిబ్బంది గైర్హాజరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రఘునాథపాలెం మండలం మంచుకొండ పిహెచ్‌సిని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంచుకొండ పిహెచ్‌సిని మధ్యాహ్నం మూడు గంటలకు తనిఖీ చేసిన కలెక్టర్ 15 మంది సిబ్బందికి ముగ్గురు ఉండడాన్ని గమనించారు. విధుల సమయంలో ఇద్దరు వైద్యులు ఆసుపత్రిలో గైర్హాజరు కావడం పట్ల కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో ఉండాల్సిన వైద్యులు ఎక్కడ ఉన్నారంటూ సిబ్బందిని కలెక్టర్ ప్రశ్నించారు. వైద్యులతో చరవాణిలో మాట్లాడిన కలెక్టర్ పనిచేయడం ఇష్టం లేకపోతే సెలవులపై వెళ్లండి అని అనవసరంగా ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిని నమ్మివచ్చే పేదల పరిస్థితి గురించి ఆలోచించకపోవడం విధుల పట్ల

మిగతా 2లో..

ఎలుక కాటుకు గుర్రై

విద్యార్థినికి తీవ్ర అస్వస్థత

-సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ తీరుపై తీవ్ర విమర్శలు
-మమతలో వైద్య చికిత్స.. ఉచితంగా అందిస్తామని పువ్వాడ ప్రకటన



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : సంక్షేమ హాస్టళ్ల నిర్వహణపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒక పక్క విమర్శల వర్షం కురుస్తున్నప్పటికీ దానిని సరిదిద్దే ప్రయత్నంలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారు. పదే పదే వరుస ఘటనలు చోటు చేసుకుంటున్నప్పటికీ తగిన చర్యలు తీసుకోవడం లేదు. ఒకే విద్యార్థిని ఎలుక వరుసగా కరవడం, ఎలుక కరిచిన ప్రతిసారి యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ ఇవ్వడం కారణంగా విద్యార్థినికి కాళ్లు చచ్చుపడిపోయి తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన ఖమ్మంలో చోటు చేసుకుంది. ఖమ్మం దానవాయి గూడెం గురుకుల పాఠశాలలో

మిగతా 2లో..

వ్యసనాలకు బానిసై తల్లిని కడతేర్చిన తనయుడు..?

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : వివాహిత హత్య పలు అనుమానాలకు దారితీస్తుంది. కన్న కొడుకే గొంతు నులిమి హత్య చేసి దొంగలు బంగారం కోసం హత్య చేసినట్లుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించాడన్న ప్రచారం జరుగుతుంది. వివరాల్లోకి వెళితే... ఖమ్మం నగరం ఖానాపురం ప్రాంతంలో కొప్పెర లక్ష్మి నారాయణ వాణి (45) దంపతులు నివసిస్తున్నారు. వీరికి త్రీనాథ్, గోపీనాథ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. లక్ష్మి నారాయణ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించే వాడు. గోపీనాథ్ కొంత కాలంగా వ్యసనాలకు బానిసై తిరుగుతుండేవాడు. మంగళవారం ఉదయం తల్లితో ఘర్షణ పడ్డాడు. ఘర్షణ పడిన కొంత సేపటికి తల్లి వాణి మృతి చెందింది. ఇంటిలో నుంచి ఎటువంటి కదలికలు లేకపోవడంతో చుట్టు పక్కల వారు వచ్చి చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వాణి మృతికి కుమారుడు గోపీనాథ్ కారణమని ఉదయం తల్లి, కొడుకు ఘర్షణ పడ్డారని స్థానికులు తెలిపారు.ఇదిలా ఉండగా వాణి హత్యను దొంగలు చేసినట్లుగా చిత్రీకరించేందుకు ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడు, చెవి దిద్దులను కుమారుడు తీసుకున్నాడని స్థానికులు అంటున్నారు. గోపీనాథ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు గోపీనాథ్ హత్య చేశాడని చెబుతున్నప్పటికీ స్థానిక పోలీసులు పలు కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నారు. పెద్ద కుమారుడు త్రీనాథ్, భర్త లక్ష్మి నారాయణ, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. వాణి చుట్టు పక్కల వారితో ఎంతో స్నేహంగా ఉండేదని చెబుతూ చుట్టు పక్కల వారు విలపిస్తున్నారు. మృతదేహాన్ని పంచనామ నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఖానాపురం హవేలీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వివాహిత హత్యపై అనుమానాలు

జమిలి వెనుక

నియంత పాలన కుట్ర

-కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుంది
-ఏడాది పొడవునా శత వసంతాల సంబురాలు
-సిపిఐ సమావేశంలో బాగం హేమంతరావు

ప్రజాపక్షం/ఖమ్మం : జమిలి ఎన్నికల వెనుక బిజెపి కుట్ర దాగి ఉందని నియంతృత్వం వైపు మోడీ ఆలోచనలు సాగుతున్నాయని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. బిజెపి , ఆర్ఎస్ఎస్‌లు జమిలి ఎన్నికలలో మతోన్మాదం ద్వారా లబ్ధి పొందాలని చూస్తున్నాయని ఇది దేశ ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. చింతకాని, కొణిజర్ల మండలాలు, పాలేరు, ఖమ్మం నియోజక వర్గాల సిపిఐ సంయుక్త సమావేశం మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో మహ్మద్ సలాం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ గడిచిన 11 సంవత్సరాలుగా బిజెపి భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తూనే ఉందని తాము ఈ దేశాన్ని శాశ్వతంగా పాలించాలన్నదే బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల లక్ష్యమని ఆరోపించారు. భారతదేశం సువిశాల ప్రజాస్వామిక దేశమని విభిన్న మతాల, భాషల, సంస్కృతుల సమ్మేళనమని ప్రాంతానికో భావన ఉండే ఈ దేశంలో జమిలి ఎన్నికలు

మిగతా 2లో..

జమిలి వెనుక నియంత పాలన కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాభిప్రాయాన్ని ప్రస్ఫూటింపచేయలేవన్నారు. ఇప్పటికే మత చిచ్చుకు తెరలేపిన బిజెపికి దేశ రాజ్యాంగంపై నమ్మకం లేదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మారిన రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని హేమంతరావు తెలిపారు. దేశంలో పాలన కార్పొరేట్లు, సంపన్న వర్గాల కోసమే సాగుతుందన్నారు. దేశంలో కమ్యూనిస్టులు బలంగా ఉన్నప్పుడు పేదలు, కార్మికులకు అనుకూలమైన చట్టాలు వచ్చాయని ప్రస్తుతం పేదల కోసం ఉన్న పథకాలు కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా వచ్చినవే అన్నారు. పెరుగుతున్న ఆర్థిక అంతరాలు, నిర్బంధాలు, సంపన్న అనుకూల శాసనాలు, వ్యవసాయ రంగం సంక్షోభం, కార్పొరేటీకరణ కారణంగా ప్రజలు కమ్యూనిస్టులు బలంగా ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్న భావనలో ఉన్నారని హేమంతరావు తెలిపారు. కమ్యూనిస్టులు బలపడటం చారిత్రిక అవసరమన్నారు. 1925 డిసెంబర్ 26న ఆవిర్భావించిన భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతంలోకి అడుగుపెడుతుందని, శత సంవత్సర సంబురాలను ఏడాది పొడవునా నిర్వహించనున్నట్లు హేమంతరావు తెలిపారు. డిసెంబర్ 26న ఖమ్మంలో రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు, వేలాది మందితో ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. వంద సంవత్సరాల పోరాట చరిత్ర, సాధించిన విజయాలు, పోరాట ఘట్టాలను నేటి తరానికి తెలియజేసేందుకు సభలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించనున్నామన్నారు. నాటి పోరాట ఘట్టాలను తెలియజేసేందుకు సాహిత్య, సంస్కృతిక రంగాలను వినియోగించుకోనున్నామని హేమంతరావు తెలిపారు. డిసెంబర్ 30న నల్లగొండలో శత సంవత్సర ప్రారంభ సభ జరుగుతుందన్నారు. ఈ సభకు ఖమ్మంజిల్లా నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలను తరలించనున్నట్లు ఆయన తెలిపారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎలుక కాటుకు గురై విద్యార్థినికి తీవ్ర అస్వస్థత

(మొదటిపేజీ తరువాయి)

పదవ తరగతి చదువుతున్న లక్ష్మి భవాని కీర్తికి ఇప్పటికీ 10 సార్లు ఎలుక కరిచింది. ఎలుక కరిచిన ప్రతిసారి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లడం వారు యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ ఇవ్వడం జరిగింది. వరుసగా వ్యాక్సిన్ ఇవ్వడంతో అది తీవ్ర అనారోగ్యానికి దారి తీసింది. తండ్రి లేని లక్ష్మి భవాని కీర్తిని నవంబర్‌లో తల్లి వరుస ఎలుక కాటుకు గురవ్వడంతో ఇంటికి తీసుకెళ్లింది. కొద్ది రోజుల తర్వాత లక్ష్మి భవాని కీర్తి కాళ్లు చచ్చుబడిపోయి నడవలేని స్థితికి చేరుకోవడంతో మమత జనరల్ ఆసుపత్రికి తీసుకు వచ్చింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూడడంతో రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. ప్రజాప్రతినిధులు సైతం తీవ్రంగానే స్పందించారు. వరుసగా ఎలుకలు విద్యార్థులను కరుస్తున్నా ఎందుకు ఎలుకల నివారణ చర్యలు తీసుకోలేదన్న ప్రశ్నకు అధికారుల వద్ద సమాధానం లేదు.

ఉంటే ఉండు లేకుంటే టిసి తీసుకుని పో...

దానవాయిగూడెం గురుకుల పాఠశాలలో కోతులు, కుక్కలతో పాటు ఎలుకలు కూడా విద్యార్థినిలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాయి. మార్చి నుంచి నవంబర్ వరకు పలుమార్లు లక్ష్మి భవాని కీర్తిని ఎలుకలు కరిచాయి. ఎలుక కరిచిందని చెప్పిన ప్రతిసారి ఉంటే ఉండు లేకుంటే టిసి తీసుకుని పో అంటూ పాఠశాల సిబ్బంది బెదిరించే వారని చికిత్స పొందుతున్న లక్ష్మి భవాని తెలిపింది. మార్చి నుంచి ఇప్పటి వరకు 15 సార్లు యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ ఇచ్చారని దాని కారణంగా క్రమేపి స్పర్శ కోల్పోయి కాళ్లు బలహీన పడ్డాయని ఆమె తెలిపింది. తల్లి బిందు కుమార్తెకు జరిగిన అనారోగ్యం పట్ల తీవ్ర ఆవేదనకు గురైంది. ఇండ్లలో పనిచేసుకుంటూ జీవించే బిందు కుమార్తె అనారోగ్యానికి గురవ్వడంతో తీవ్రంగా విలపిస్తుంది.

ఉచిత వైద్యం...

లక్ష్మి భవాని కీర్తికి మమత ఆసుపత్రి ద్వారా ఉచిత వైద్యాన్ని అందించనున్నట్లు మాజీ మంత్రి, మమత ఛైర్మన్ పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల పట్ల ప్రభుత్వ వైఖరి సరైంది కాదన్నారు. వరుసగా సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. లక్ష్మి భవాని కీర్తి కోలుకునేంత వరకు మమత ఆసుపత్రి ద్వారా ఉచిత వైద్యాన్ని అందిస్తామని ఆయన తెలిపారు.

ప్రభుత్వానిదే బాధ్యత : ఎంపి వద్దిరాజు

ఖమ్మంలోని బిసి గురుకుల పాఠశాల విద్యార్థిని లక్ష్మి భవాని కీర్తి అనారోగ్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. లక్ష్మి భవాని కీర్తి హాస్టల్‌లో ఉంటూ ఎలుక కాటుకు గురై తీవ్ర అనారోగ్యం పాలైందని తెలిసిన వెంటనే ఆయన తీవ్రంగా స్పందించారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమెను హైదరాబాద్ తరలించి మెరుగైన వైద్య చికిత్స అందించాలన్నారు. ఏడాది కాలంగా సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సరైన ఆహారం, సౌకర్యాలు లేవని వద్దిరాజు తెలిపారు. సౌకర్యాలు కల్పించాలని అడిగితే విపక్షాలను తప్పుబడుతున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా విద్యార్థుల జీవితంతో చెలగాటమాడకుండా సౌకర్యాలు కల్పించాలని, మెరుగైన భోజనం అందించాలని ఆయన కోరారు. మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు, మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. వెంకటవీరయ్య మమత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మి భవాని కీర్తిని పరామర్శించారు.

వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డులో చిట్యాల పుల్లయ్య మంగళవారం ఉదయం మృతి చెందారు. ఆయన నేత్రాలను ఖమ్మం నేత్రనిధికి దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షులు చింతలపూడి వెంకటేశ్వరరావు ప్రోత్సాహంతో వారు అంగీకరించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఖమ్మం నేత్రనిధి వైద్యులు కోటేశ్వరరావు నేత్రాలను సేకరించారు. నేత్రదానంకు అంగీకరించిన కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు. ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నేత్రదానం చేయాలని ఒక నేత్రదానం ఇద్దరి నుండి నలుగురు అంధులకు కంటిచూపు ప్రసాదిస్తుందని మరణానంతరం 6 నుండి 8 గంటల్లోగా నేత్రదానం చేయాలని, నేత్రదానం అనగా నల్లటి కను గుడ్డుపై ఉండే పల్చటి పొరను దానం చేయడం మాత్రమే అన్నారు. కనుగుడ్డును పూర్తిగా తీయారని తెలిపారు. చిట్యాల పుల్లయ్యనేత్రాలను నేత్రనిధికి దానం చేసేందుకు ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను ఆయన అభినందనలు తెలిపారు. అనంతరం ఆకస్మికంగా మృతి చెందిన చిట్యాల పుల్లయ్య కుటుంబ సభ్యులను డాక్టర్ కాపా మురళీకృష్ణ శ్యామ్‌బాబు పరామర్శించారు. పుల్లయ్య పార్థివ దేహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి హాస్పిటల్ నిర్వాహకులు జివిస్టీ కోఆర్డినేటర్ వుండ్రు శ్యామ్‌బాబు, స్థానికులు దార్న రాజశేఖర్, కట్టా నర్సింహారావు, సాయిబాబా మందిరం కోశాధికారి లగడపాటి బోస్ తదితరులు పాల్గొన్నారు.

కార్పోరేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

అధికారులకు సరైన అవగాహన లేకపోవడం వల్ల, ఆర్డర్‌ను అర్థం చేసుకోవడంలో లోపం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అదే విధంగా పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికల నిర్వహణకు ఆటంకంగా మారిందన్నారు. ఇలాంటి సాకేంతిక లోపాలను అధిగమించి కార్పోరేషన్ ఏర్పాటు, పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. పాల్వంచ కేటిపిఎస్‌లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని త్వరితగతిన ప్రారంభించాలని కోరుతున్నామన్నారు. కార్పోరేషన్ ఏర్పాటు విషయమై పలుమార్లు జిల్లా మంత్రుల సహకారంతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, కార్పోరేషన్ ఏర్పాటుతో పారిశ్రామిక ప్రాంతాలైన కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలతో పాటు పరిసర గ్రామాలు మరింత అభివృద్ధి సాధించేందుకు దోహదపడతుందన్నారు.

పనిచేయండి.. లేదా సెలవులపై వెళ్లండి

(మొదటిపేజీ తరువాయి)

నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని కలెక్టర్ తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఎంఅండ్‌హెచ్‌వోను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పిహెచ్‌సిలలో విధుల సమయంలో వైద్యుల హాజరును డిఎంఅండ్‌హెచ్‌వో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఆసుపత్రిలో ఔట్ పేషంట్ సేవలు, వైద్య సిబ్బంది హాజరు రిజిస్టర్, ల్యాబ్ పరీక్షల నమూనాల రిజిస్టర్‌ను, మందుల నిల్వలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వార్డులలో రోగుల వివరాలను అడిగారు. ఆసుపత్రిలో ప్రసూతి మహిళా సేవలను, వైద్య సేవలను మెరుగుపర్చాలని వైద్యులు సమయ పాలన పాటించాలని తెలిపారు. రోజుకు ఎన్ని ఓపిలు చూస్తున్నారు, ఎంత మంది ప్రసూతి మహిళలకు ఆరోగ్య బలమైన మందులు అందిస్తున్నారు, నార్మల్ డెలివరీని పెంచుటకు గర్భిణీలను ప్రోత్సహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలోని రోగులతో ఆరోగ్య వివరాలు, ఆసుపత్రి సిబ్బంది వ్యవహరించే తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తే ప్రభుత్వాన్ని నిలదీయక తప్పదు

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం
AIKS
మధిర మండల సమితి

ప్రజాపక్షం/ మధిర : ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయక తప్పదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, మందడపు రాణి అన్నారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ అనుబంధ తెలంగాణ రైతు సంఘం(ఎఐకెఎస్) ఆద్వర్యంలో మంగళవారం మధిర తహశీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించిన అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.2లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఏడాది కావస్తున్న మాఫీకి పూనుకోలేదని, కంటి తడుపుగా రూ.1లక్షలోపు రుణాలను అనేక నిబంధనలు విధించి పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. ఇప్పటి వరకు ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన రైతు భరోసా జమ చేయకుండా కాలాయాపన చేస్తూ పరోక్షంగా రైతులను అప్పుల ఊబిలోకి నెట్టి వేస్తోందన్నారు. తక్షణమే రైతు భరోసా జమ చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళను చేపడుతామని హెచ్చరించారు. ధరణి పోర్టల్‌పై అనేక ఆరోపణలు చేసి రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం అందుకు తగిన విధంగా కొత్త రెవెన్యూ చట్టం తీసురావడంలో తీవ్ర జాప్యం చేస్తుండటంతో సాగుదారులు అన్యాయానికి గురవుతున్నారన్నారు. తక్షణమే రైతులందరికీ రుణమాఫీ చేయాలని, రైతుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు, జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాశ్‌రావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు రహీం, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి మంగళగిరి రామాంజనం, రంగు నాగకృష్ణ, సిలువేరు శ్రీనివాసరావు, పొన్నవెల్లి అప్పారావు, ఎస్కే కొండ, సుజాత, రామారావు, నాగలక్ష్మి , కిట్టమ్మ పాల్గొన్నారు.

చలో రాజ్‌భవన్ ముట్టడిని విజయవంతం చేయండి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జరిగే రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమాన్ని ఖమ్మం జిల్లానుంచి అధిక సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లి విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐసిసి పిలుపు మేరకు టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశానుసారం చలో రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దుర్గాప్రసాద్ తెలిపారు. అమెరికాలో గౌతమ్ అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకలు దేశ వ్యాపార, ఆర్థిక రంగాల పరువును దెబ్బతీశాయన్నారు. మణిపూర్‌లో వరుసగా జరిగిన అల్లర్లు, విధ్వంసంపై మోడీ ఇప్పటి వరకు ఆ రాష్ట్రాన్ని సందర్శించకుండా కాలయాపన చేస్తున్నందుకు వీటన్నింటిపై తక్షణమే వివరణ ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా చలో రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, ప్రజాప్రతినిధులు, కార్పోరేషన్ ఛైర్మన్లు పాల్గొంటారని ఆయన తెలిపారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పెన్షనర్లు సమాజానికి స్ఫూర్తి ప్రదాతలు

జాతీయ పెన్షనర్స్ దినోత్సవము
తేది: 17-12-2024
వేదిక: భక్తరామదాసు కళాక్షేత్రం, ఖమ్మం
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం

-ప్రతి శుక్రవారం సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక వైద్య శిబిరం
-కలెక్టరేట్‌లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు
-జాతీయ పెన్షనర్స్ డే కార్యక్రమంలో కలెక్టర్

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పెన్షనర్లు సమాజానికి స్ఫూర్తి ప్రదాతలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం జాతీయ పెన్షనర్స్ డే సందర్భంగా భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పెన్షనర్స్ డే కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మా కుటుంబం నాలుగు తరాలుగా ప్రభుత్వం తరుపున ప్రజలకు సేవ చేస్తున్నామని, పెన్షనర్లు సమాజానికి స్ఫూర్తి ప్రదాతలని, కష్టాలు ఉన్నప్పుడు, ఆపద సమయంలో పెద్దలు ఇచ్చే సలహాలతోనే వాటి నుంచి బయటపడతామని ఆయన తెలిపారు. గత కొన్నేళ్లుగా వేలాది మంది పడిన శ్రమ ఫలితంగానే నేడు సమాజానికి ఒక చక్కటి వ్యవస్థ అందుబాటులో ఉందన్నారు. ఒక దరఖాస్తు మన వద్దకు వస్తుందంటే అది పరిష్కారం అవుతుందని గతంలో అధికారులు చూపించిన నమ్మకం మాత్రమే అన్నారు. జిల్లా ఆసుపత్రిలో పెన్షనర్లు, సీనియర్ సిటిజన్లకు వైద్య చికిత్స అందించేందుకు ప్రతి శుక్రవారం ప్రత్యేక విభాగం పని చేస్తుందని సీనియర్ సిటిజన్లకు అవసరమైన ఐదారు రకాల ప్రత్యేక వైద్యులు ఒకే చోట అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తారని దీనిని వినియోగించుకోవాలని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ కోసం జిల్లా కలెక్టరేట్‌లో ర్యాంపు పక్కన ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని, కలెక్టరేట్‌లో సీనియర్ సిటిజన్స్‌కు ఏ శాఖతో పని ఉన్నప్పటికీ ఒకే దగ్గర దరఖాస్తులు తీసుకుని వాటిని సంబంధిత శాఖలకు కేటాయించి పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. వారం రోజుల వ్యవధిలో ఈ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. పెన్షనర్స్, సీనియర్ సిటిజన్స్ కోసం అనువైన స్థలాన్ని ఎంపిక చేసి అప్పగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పెన్షనర్ల అనుభవం ఉపయోగించుకునేందుకు ప్రతి నెల కలెక్టరేట్‌లో సీనియర్ సిటిజన్స్ టాక్ ఏర్పాటు చేస్తున్నామని ఈ కార్యక్రమంలో పెన్షనర్లు వచ్చి నూతన ఉద్యోగులకు తమ అనుభవాలను అందించాలని కలెక్టర్ కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ పెన్షనర్లను సన్మానించారు.ఈ కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, జిల్లా కోశాధికారి ఎస్‌విఎస్ నర్సింహా, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య, రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బయ్య, సబ్ ట్రెజరీ అధికారి మోదుగు వేలాద్రి, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు వెలిగేటి చంద్రమోహన్, జిల్లా ఆరోగ్య అధికారి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు తాళ్లూరి వేణు, జనార్ధన్, దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి

-ప్రభుత్వ పాఠశాలల్లో అర్ధకాలితో విద్యార్థులు
-ఫుడ్ పాయిజన్ ఘటనలపై ముఖ్యమంత్రి బాధ్యత వహించాలి
-ఏఐఎస్ఎఫ్ డిమాండ్

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : సంక్షేమ గురుకుల పాఠశాలలు సంక్షోభంలో కూరుకుపోయాయని తక్షణమే గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని రఘునాథపాలెం గురుకుల బాలికల పాఠశాలతో పాటు మరికొన్ని గురుకుల పాఠశాలలను ఏఐఎస్ఎఫ్ ఖమ్మంజిల్లా సమితి ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తవుతున్నప్పటికీ గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో, సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం విద్య పట్ల ధ్వంద వైఖరిని ప్రదర్శిస్తుందన్నారు. విద్యాశాఖ మంత్రిని కేటాయించకుండా, విద్యా రంగంపై సమీక్ష నిర్వహించకుండా ప్రభుత్వ విద్య ఎలా బలోపేతం అవుతుందని లక్ష్మణ్ ప్రశ్నించారు. పాఠశాలలు, సంక్షేమ గురుకులాలు మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేని కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురై కొంత మంది విద్యార్థులు మరణిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి చలనం లేదన్నారు. ఇంకా ఎంత కాలం పురుగుల అన్నం, నీళ్ల చారు అంటూ విద్యార్థులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన బాటపడుతున్నా ప్రభుత్వానికి కనికరం లేదన్నారు. వరుస ఘటనలపై ముఖ్యమంత్రి బాధ్యత వహించి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని లేని యెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నాగులమీరా, నాయకులు బి.మనోజ్, వంశీ, రోహిత్, రాజు, సాయి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఖరికి నిరసనగా బిఆర్ఎస్ ఆందోళన

అంబేద్కర్ విగ్రహానికి వినతి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : రైతుల పట్ల కక్ష సాధింపులు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బిఆర్ఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ పిలుపు మేరకు మంగళవారం బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌ఎ సండ్ర వెంకటవీరయ్య, నగర అధ్యక్షులు పగడాల నాగరాజు మాట్లాడుతూ గిరిజన రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని వారు తీవ్రంగా ఖండించారు. లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించారని వారు ఆరోపించారు. రైతులకు బేడీలు వేసి వారి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశత్వంగా వ్యవహరిస్తుందన్నారు. రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని మార్చుకోకపోతే బిఆర్ఎస్ ఆధ్వర్యంలో గిరిజన రైతుల పక్షాన ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దాదె అమృతమ్మ, మగ్బూల్, పల్లా రోజ్‌లీనా, దండా జ్యోతిరెడ్డి, బుర్రి వెంకట్, మాటేటి నాగేశ్వరరావు, కన్నం ప్రసన్న, తాజుద్దీన్, బొమ్మెర రామ్మూర్తి, వీరునాయక్, గుత్తా రవి, బిచ్చాల తిరుమలరావు, దోకుపర్తి సుబ్బారావు, మేకల సుగుణారావు, కొల్లు పద్మ, పగడాల నరేందర్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

20న దుబాయ్ డెలివరీ బాయ్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : దుబాయ్ (యుఏఈ)లో డెలివరీ బాయ్స్‌గా పనిచేయుటకు బైక్ రైడర్స్ కోసం ఈనెల 20న హైదరాబాద్‌లోని విజయనగర్ కాలనీలోని మల్లేపల్లి ఐటిఐ క్యాంపస్‌లో టాం కాం ద్వారా నిర్వహించే ఇంటర్వ్యూలకు ఆసక్తి, అర్హత గల వారు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి శిక్షణ , కార్మాగారాల శాఖ క్రింద నమోదు చేయబడిన రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ టాం కాం అని దీని ద్వారా తెలంగాణ నుండి అర్హత, నైపుణ్యం కలిగిన వారికి ఉద్యోగాలు కల్పించేందుకు విదేశాలలో ప్రభుత్వ, ప్రైవేట్ రిజిస్టర్డ్ ఏజెన్సీలతో భాగస్వామ్యం కుదుర్చుకుందని ఆమె తెలిపారు. 21 నుండి 38 సంవత్సరాల వయస్సు కలిగిన అభ్యర్థులు తప్పనిసరిగా పదవ తరగతి ఉత్తీర్ణులై మూడేళ్ల పాత డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఇంటర్వ్యూకు ఒరిజినల్ పాస్ పోర్టు తప్పనిసరిగా తీసుకు రావాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు 9440050951, 9440049861, 9440051452 నెంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

బిఆర్ఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ పిలుపుమేరకు ఖమ్మంరూరల్ మండలం తల్లంపాడు గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు పాలేరునియోజకవర్గ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డి తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో లఘుచర్ల రైతుల భూముల విషయంలో జరిగిన ఘటనపై నిరసనగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, ఖమ్మంరూరల్ మాజీ జెడ్పిటీసీ యండపల్లి వర ప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ గుడిబోయిన దర్గయ్య, ఖమ్మంజిల్లా డిసిసిబి మాజీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, ఏదులాపురం సొసైటీ చైర్మన్ మంకెన నాగేశ్వరరావు, మారెమ్మగుడి చైర్మన్ మట్టా వెంకటేశ్వర్లు, బిఆర్ఎస్ మండల నాయకులు ముత్యం పెద్ద కృష్ణారావు, షేక్ మైబల్‌సాబ్, శంకర్రాజు, జొన్నలగడ్డ శ్రీధర్, మొర్రిమేకల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

హస్తం మనందరి నేస్తం
జై జై కాంగ్రెస్

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: ఖమ్మం నగరంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం మండలాలకు చెందిన 89 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.29లక్షల32వేల500 వందల విలువగల చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లిమార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు, జిల్లా నాయకులు భూక్య సురేష్‌నాయక్, ఖమ్మంరూరల్ మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు కళ్లెం వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కర్లపూడి భద్రకాళి, ఒకటవ డివిజన్ కార్పొరేటర్ హుస్సేన్, తిరుమలాయపాలెం మాజీ ఎంపీపీ మంగిలాల్ , నాయకులు ప్రతాపనేని రఘు తదితరులు పాల్గొన్నారు.

వంగూరి మోసయ్య ధన్యజీవి

ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ మండలం నూతనకల్ గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ సీనియర్ సభ్యులైన వంగూరి మోసవయ్య సంతాప సభ నూతనకల్‌శాఖ కార్యదర్శి శ్రీను అధ్యక్షతన జరిగింది. ఈ సభలో సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బొంతు రాంబాబు పాల్గొని మాట్లాడుతూ నూతనకల్ గ్రామంలో వంగూరి మోసయ్య అన్నదమ్ములు నమ్మిన సిద్ధాంతం కోసం పేద ప్రజల కోసం ఎర్రజెండాతోనే ఉండి వారి తల్లిదండ్రులు చూపించిన మార్గంలోనే చివరి వరకు ప్రయాణం చేసి ప్రస్తుతం ఉన్న రాజకీయ నాయకులకు వారు ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఒకే భాష ఒకే మతం ఒకే ఎన్నిక అని చెప్పి ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా వారి ప్రభుత్వ తీరు ఉందని దుయ్యబట్టారు. అదేవిధంగా రాష్ట్రంలో కూడా ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను ఈ ప్రభుత్వం కూడా చేస్తుందని, ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, నాయకులు కళ్యాణం కృష్ణయ్య, నల్లమోతు మోహన్‌రావు, సత్తెనపల్లి నరేష్, వంగూరి లోకేశ్వరరావు, దారెల్లి కృష్ణ, సుందర్‌రావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల సాధన కోసం పాటుపడుతా..

ప్రజాపక్షం/కొణిజర్ల : ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, సీఆర్టీల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పాటుపడతానని టిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్ అన్నారు. టిఎస్‌యుటిఎఫ్ 6వ మహాసభలు ఈనెల 14 , 15 తేదీల్లో సత్తుపల్లి పట్టణంలో ఘనంగా జరిగాయి. కొణిజర్ల మండలంలోని తనికెళ్ల గ్రామానికి చెందిన షేక్ రంజన్ పెద్దగోపతి హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తునాడు. ఈ మహాసభల్లో ఆయనను టిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం ఆయన కొణిజర్లలో మాట్లాడుతు గిరిజన సంక్షేమ శాఖలోని పండిట్స్ , పిఈటీ పోస్టులు అప్‌గ్రేడేషన్ కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయపోస్టులు మంజూరు కొరకు కేజీబివి , సర్వశిక్షఅభయాన్ ఉద్యోగులకు మినిమం టైమ్స్ స్కేలు కాంట్రక్ట్ టీచర్స్ ఏఎన్ఎం , కంప్యూటర్ ఫ్యాకల్టీ లకు ప్రతినెల జీతాలు అందేలా , పిఆర్సీ , పెండింగ్ డిఏలను సాధించుకోవాల్సి ఉందని అన్నారు. దశాలవారి పోరాట కార్యక్రమాల్లో భాగస్వామ్యం అయి ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల సాధనకోసం పటుపడతానని తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన రంజాన్‌ను యుటిఎఫ్ మండలకమిటి అభినందించింది.

లగచర్ల ఘటనపై బిఆర్ఎస్ నిరసన

ప్రజాపక్షం/పెనుబల్లి: బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు పెనుబల్లి మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు లగచర్లలో జరిగిన అమాయక గిరిజనులపై జరిగిన దాడికి నిరసనగా, అక్రమ అరెస్టును, వారికి బేడీలు వేసి థర్డ్ డిగ్రీ ఉపయోగించడాన్ని ఖండిస్తూ, నిరసనను తెలిపి వినతి పత్రం అందజేశారు. లగచర్ల రైతుల మీద పెట్టిన కేసులను ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కనగాల వెంకటరావు, కొప్పుల గోవిందరావు, పసుమర్తి వెంకటేశ్వరరావు, మందడపు అశోక్, భూక్య ప్రసాద్, తాళ్లూరిశేఖర్‌రావు,బెల్లంకొండచలపతిరావు,పొట్లపల్లి ప్రసాద్, మల్లెల సతీష్ పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని ప్రభుత్వాలు

ప్రజాపక్షం/ బోనకల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఏ మాత్రం పట్టించుకోవటం లేదని, రైతులకు ఎటువంటి షరతులు లేకుండా ప్రతిఒక్కరికి రైతు రుణమాఫీ చేయాలని వైసిపి బోనకల్ మండల మాజీ అధ్యక్షులు ఇరుగుజాజేసు, బహుజన సమాజ పార్టీ మధిర నియోజకవర్గ అధ్యక్షులు గంధం వంశీ, ఆమ్ ఆద్మీ పార్టీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగం పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బోనకల్ జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులందరికీ రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని, రైతు బీమా చెల్లించాలని, రైతు భరోసా కల్పించాలని రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీ నుంచి వచ్చే ధాన్యాన్ని రానివ్వం..

ప్రజాపక్షం-నేలకొండపల్లి : ఏపీ నుంచి వస్తున్న ధాన్యం లారీలను తెలంగాణలోకి అనుమతి ఇవ్వమని జిల్లా మార్కెటింగ్ అధికారి ఆలీం అన్నారు. మార్కెట్ పరిధిలోని పలు చెక్‌పోస్టులను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ఇటీవల ఏపీ నుంచి ధాన్యం లారీల పై గతంలో మార్కెట్ ఫీజు వసూలు చేశారని అన్నారు. కానీ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఇక నుంచి అనుమతి ఇచ్చేది లేదని అన్నారు. రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులలో విస్తృతంగా తనిఖీ లు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని 8 మార్కెట్‌ల నుంచి 21 చెక్‌పోస్టుల ద్వారా ఫీజు ఆశించిన స్థాయిలో వస్తుందని అన్నారు. జిల్లా మార్కెట్ ఫీజు మొత్తం రూ.67 కోట్లు టార్గెట్ ఉండగా..ఇప్పటికే రూ. 37 కోట్ల మేర వసూలు చేసినట్లు తెలిపారు. మార్చి నాటికి జిల్లా మార్కెట్ ఫీజు లక్ష్యం ను సాధిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల అక్రమ అరెస్టులు సరికాదు

ప్రజాపక్షం-నేలకొండపల్లి : గ్రామ పంచాయతీ కార్మికుల అక్రమ అరెస్టులు సరికాదని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పగిడికత్తుల రామదాసు అన్నారు. మంగళవారం హైద్రాబాద్ లో తలపెట్టిన సభ కు వెళ్తున్న సందర్భంగా ఆయన మాట్లాడారు..కార్మికులను సభ కు వెళ్లకుండా అరెస్ట్ చేయటం ను తీవ్రంగా ఖండించారు. అర్ధరాత్రి ఇళ్ల పై దాడులు చేసి అక్రమ అరెస్ట్ లు చేయటం దారుణం అన్నారు. కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తూ వేతనాలు అడిగితే అరెస్టులు చేయటం సమంజసమేనా అన్నారు. ప్రభుత్వం తీరు మారాలని సూచించారు. వెంటనే న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల నాయకులు రహిముతుల్లా, బాబు, వీరబాబు, బుచ్చిరాములు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురం పిఎసిఎస్‌కు రూ.30లక్షల స్థలం వితరణ

-సహకారం మరింత బలోపేతం చేస్తాం

-బత్తినేని ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బత్తినేని నాగప్రసాదరావు

ప్రజాపక్షం/బోనకల్: మండలంలోని నారాయణపురం ప్రాథమిక సహకార పరపతి సంఘానికి రూ.30లక్షల విలువచేసే 75 సెంట్ల స్థలాన్ని బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, నారాయణపురం పిఎసిఎస్ ఛైర్మన్ బత్తినేని నాగప్రసాదరావు కొనుగోలు చేసి వితరణగా సొసైటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించి తహసీల్దార్ అనిశెట్టి పున్నంచందర్ సమక్షంలో పత్రాలను సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నాగప్రసాదరావు మాట్లాడుతూ నారాయణపురం, చిన్నబీరవల్లి గ్రామాల రైతులకు నారాయణపురం ప్రాథమిక సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో మరింత సహకారం అందిస్తామని అన్నారు. సొసైటీ రూ.1.50 కోట్ల లాభాల్లో ఉందని, 700 మందికి పైగా సభ్యులు ఉన్నారని అన్నారు. రైతులు సొసైటీ సేవలను సద్వినియోగించుకోని, జిల్లాలో మొదటి స్థానంలో నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, మాధవరపు వెంకటేశ్వరరావు, విశ్రాంత సిఈఓ యనమద్ది శ్రీనివాసరావు, మాజీ సొసైటీ ఛైర్మన్ కాకాని హన్మంతరావు, సొసైటీ డైరక్టర్లు మన్నెపల్లి వెంకటేశ్వరరావు, పోతినేని నరసింహారావు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సహాయ కార్యదర్శి ఆకెన పవన్ పాల్గొన్నారు. ,

సరిహద్దుల నుంచి అక్రమ రవాణా నియంత్రణకు స్పెషల్ డ్రైవ్

ఖమ్మం సీపీ సునీల్‌దత్

పోలీస్ స్టేషన్ నేలకొండపల్లి

ప్రజాపక్షం/నేలకొండపల్లి : రాష్ట్ర సరిహద్దుల నుంచి అక్రమ రవాణాను నియంత్రించేందుకు స్పెషల్ డ్రైవ్ ను నిర్వహిస్తూ...వాహనాల తనీఖీలు ముమ్మరం చేయాలని ఖమ్మం సీపీ సునీల్‌దత్ సూచించారు. నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్ ను మంగళవారం సందర్శించారు. వివిధ రికార్డులను పరిశీలించారు. పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు, జనరల్ డైరీ, రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. పిటిషన్ విచారణలకు సంబంధించి సిబ్బంది తో మాట్లాడారు...పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతి స్పందన సమయం, డీసీ షీట్, సస్పెక్ట్ షీట్‌లు, ఎన్‌బీడబ్ల్యు అమలు, సీసీసీ పిటిషన్‌లు పెండింగ్ అంశాల ను పరిశీలించారు. ఇటీవల వృద్ధ దంపతులను పథకం ప్రకారం హత్య చేసిన నిందుతులను పట్టుకునేందుకు కేసును చాలెంజ్ గా తీసుకుని చేధించిన నేలకొండపల్లి పోలీస్ సిబ్బందికి జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..పకడ్బందీ ప్రణాళికలతో అందుబాటులో ఉన్న సాంకేతిక ను వినియోగించి కీలకమైన హత్య కేసు ను అనతి కాలంలోనే చేధించారని కొనియాడారు. అదే విధంగా సరిహద్దుల నుంచి అక్రమ రవాణా ను నియంత్రించేందుకు స్పెషల్ డ్రైవ్ చేయనున్నట్లు తెలిపారు. స్టేషన్ హౌస్ మేనేజ్‌మెంట్, పోలీస్‌స్టేషన్ నిర్వహణ, సెక్టార్ ఆఫీసర్ల బాధ్యతలు, రెగ్యూలర్ రోల్‌కాల్ విధిగా అమలు చేయాలని సూచించారు. పెట్రోకార్, బీట్ డ్యూటీ సిబ్బంది ఏ విధమైన విధులు నిర్వహిస్తున్నారు..పాత నేరస్తుల నివాసాల కదలికల పై ఏ విధంగా గుర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ లు సంజీవ్, మురళీ, రాజు, వివిధ పోలీస్‌స్టేషన్ ఎస్సైలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఆచరణలో పెట్టాలి : పిఓ

ప్రజాపక్షం/భద్రాచలం : గణితం, ఇంగ్లీష్‌లలో విద్యార్థులను రానించేందుకు సిద్ధంచేసి అందించిన ఉద్దీపన పుస్తకాలను అనుసరిస్తూ ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించేలా ఆచరణలో పెట్టాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. మంగళవారం దుమ్ముగూడెం మండలంలోని బండాహుగూడెం, రేగుంట జిపిఎస్ పాఠశాలలు, ఆర్లగూడెం, ఏహెచ్ ఎస్ బాలురు ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థుల సామర్థ్యాన్ని వారినే అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్దీపన పుస్తకంలోని అంశాలను వారితో బోర్డుపై రాయించారు. అనంతరం పిఓ మాట్లాడుతూ 3వ తరగతి నుండి 5వ తరగతి వరకు చదువుతున్న గిరిజన పిల్లలు ఇంగ్లీష్, గణితం చదవడం, రాయడంలో వెనుకబడిపోతున్నందున సులువుగా నేర్చుకునేందుకు రూపొందించిన ఉద్దీపన పుస్తకంలోని అంశాలను పిల్లలకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించడం లేదన్నారు. ఎస్‌సిఆర్‌పి పనితీరు మెరుగుపరుచుకోవాలన్నారు. రేగుంట పాఠశాల ఉపాధ్యాయు రాలు వసంత అనధికారికంగా సెలవుపై వెళ్లినందున, వెంకన్న, సత్తెమ్మ టీచింగ్ డైరీ నిర్వహణ సరిగా లేదనందున షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఏసిఎంఓ మరమయ్యను ఆదేశించారు. అనంతరం ఆర్లగూడెం పాఠశాలను సందర్శించి వేదిక్ మెస్ తరగతిని పరిశీలించారు. పిల్లలు లెక్కలు ఎలా చేస్తున్నది పరిశీలించారు. పిల్లలు బడిలోనేర్చుకున్నదే కాకుండా ఇంటికి వెళ్లి కూడా ప్రాక్టీస్ చేయాలన్నారు. నూతన మెనూ ప్రకారం పిల్లలు అన్ని రకాలు ఆహార పదార్థాలు అందించాలని, ఇందుకు వార్డెన్లు, హెచ్ఎంలు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సోమశేఖర్, పి రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వలాభం కోసమే జిల్లా ఒలింపిక్ అసోసియేషన్

ప్రజాపక్షం/కొత్తగూడెం : జిల్లా ఒలంపిక్ అసోసియేషన్‌ను కొందరు స్వార్థ పరులు వారి స్వలాభం కోసమే ఏర్పాటు చేశారని సీనియర్ జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారుడు ఎండి బాబ్జీ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. అసోయేషన్ రిజిష్టర్ చేయించి రాష్ట్ర అసోసియేషన్‌కు అనుసంధానం లేకుండా అధికారులు, రాజకీయ నాయకులకు కొందరు తప్పుడు సమాచారాన్ని అందిస్తూ అసోసియేషన్‌లో ఉన్న కొందరు సొంతగా లబ్దిపొందాలని వ్యవహరిస్తున్నారని అన్నారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో కేవలం పది ఉమ్మడి జిల్లాలకు మాత్రమే జిల్లా ఒలిపింక్ అసోసియేషన్ ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్ర ఒలిపిక్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ మధ్య కాలంలో అన్ని జిల్లాలతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాను కలిపి ఉమ్మడి జిల్లా ఒలిపికె అసోసియేషన్‌ను ఎన్నుకున్నారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర అసోసియేషన్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తూతూ మంత్రంగా కొందరు స్వార్థ పరులు సొంతగా తప్పుడు అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని తప్పుదోవ పట్టిస్తున్నారని చెప్పారు. ఇలాంటి చర్యల వల్ల క్రీడాకారులకు నష్టం వాటిల్లే పరిస్థితి ఉందన్నారు. ఈ విషయాన్ని క్రీడా సంఘాలు అన్ని ఖండిస్తున్నాయని అన్నారు. సదరు విషయంపై కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ముఖ్య క్రీడా సంఘాలు కోరుతున్నట్లు బాబ్జీ ఆ ప్రకటన ద్వారా కోరారు.

పేదవాడు ఉన్నంతవరకు ఎర్రజెండా పోరాడుతూనే ఉంటుంది..

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య

ప్రజాపక్షం/మణుగూరు: పేదవాడు ఉన్నంతవరకు ఎర్రజెండా వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతూనే ఉంటుందని, సిపిఐ పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని, అధికారం వున్నా లేకున్నా పేద ప్రజల పక్షాన సిపిఐ పని చేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య అన్నారు. మంగళవారం శివాలింగాపురం గ్రామంలో ఏ.ప్రవీణ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా బి. అయోధ్య హాజరై మాట్లాడుతూ శివలింగపురం 2 శాఖ గ్రామంలో పూర్తిగా పేద, మధ్య తరగతి, పేద ప్రజలు, గిరిజనులు ఎక్కువగా వున్నటువంటి ప్రాంతం, మున్సిపాలిటీ కావడం వలన వంద రోజుల పని లేక మహిళలు, గ్రామ ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మున్సిపాలిటీ గ్రామాల్లో పరిస్థితిలు అధ్వానంగా ఉన్నాయని సైడ్ కాలలు తీయడం లేదని, రోడ్ల వెంట చెత్తా చెదారం పేరుకుపోయిందని, బ్లీచింగ్ పౌడర్ చల్లే పరిస్థితి లేదని, వీధి దీపాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలోని కొన్ని గ్రామాలను పంచాయతీగా చేయాలని మేము కూడా కోరుతున్నామన్నారు. మున్సిపాలిటీ ప్రజల బాధలను పట్టించుకునే పరిస్థితి లేదని, కేవలం బండారిగూడెం సెంటర్ వరకే పరిమితం అవుతున్నారని శుభ్రం చేస్తున్నారని వారు అన్నారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పేద ప్రజల పక్షాన సిపిఐ పార్టీ నిరంతరం పని చేస్తుందని దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. మున్సిపాలిటీ గ్రామాల్లో పరిస్థితి అధ్వానంగా ఉందని, సంబంధిత మునిసిపల్ శాఖ కనీసం కాలువలు శుభ్రం చేసే పరిస్థితి లేదని, మున్సిపాలిటీ అక్కడక్కడ పోయినటువంటి వీధిలైట్లు వెంటనే ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. సిపిఐ పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా వాడవాడలా పార్టీ శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీ కుమారి, పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్, ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు తోట రమేష్, ఏఐటియుసి కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, ఆడబాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సిపిఐ శివలింగాపురం 2 శాఖ నూతన గ్రామ కమిటీ ఎన్నిక జరిగింది.

గెలుపు దిశగా టిఎన్‌టియుసి, మిత్రపక్షాలు

మంచిని గుర్తిద్దాం
మళ్ళీ గెలిపిద్దాం
11 12 1 10 2 9 3 8 4 7 6 5
TNTUC E-229
మిత్రపక్షాలు

ప్రజాపక్షం/బూర్గంపాడు: ఐటిసి పిఎస్‌పిడి యూనిట్ భద్రాచలం నందు రాబోయే గుర్తింపు సంఘ ఎన్నికల వాతావరణం వేడెక్కుతుంది. ఇటీవల డిప్యూటీ లేబర్ కమిషనర్ నుండి జాయింట్ మీటింగ్ కాల్ ఫర్ చేయడం జరిగింది. తదుపరి మీటింట్ డిసెంబర్ 21న ఏర్పాటు చేయడం జరిగింది. ఆ మీటింగ్‌లో ఎన్నికలకు సంబంధించి కొంత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుత గుర్తింపు సంఘం అయిన టిఎన్‌టియూసి, మిత్రపక్షాలు గెలుపు వైపు పయనిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. సకాలంలో మంచి వేతన ఒప్పందం చేసి ఒప్పందంలో రాసిన ప్రతి పాయింట్లు అమలు చేస్తూ డిపార్ట్మెంట్ సమస్యలను పరిష్కరిస్తూ...నిత్యం అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా పని చేస్తున్న గుర్తింపు సంఘ అధ్యక్షులు కనకమేడల హరిప్రసాద్, టీం వైపు కార్మికుల చూపు ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతుంది.

ప్రస్తుత పరిస్థితులు....

ఒక వైపు మంచి వేతన ఒప్పందం చేసి కార్మికులు అందరి మన్ననులు అందరి మద్దతుతో ముందుకు వెళ్తున్న టిఎన్‌టియూసి, మిత్రపక్షాలు మరొక వైపు అత్యంత దారుణమైన వేతన ఒప్పందాలు చేసిన, ప్రతిపక్షంగా ఎటువంటి పోరాటాలు చేయకుండా కార్మికుల మద్దతు కోల్పోయిన ఐఎన్‌టియూసి, బిఆర్ఎస్‌టియూ సంఘాల మధ్య త్రిముక పోటీ ఉండే అవకాశం ఉందని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ త్రిముఖ పోటీలో టిఎన్‌టియూసి, మిత్రపక్షాల గెలుపు నల్లేరుపై నడకవలే కనిపిస్తుంది.

మంచి ఒప్పందంచేయడం- ఒప్పందాన్ని 100శాతం అమలు చేయడం....

గత అన్ని ఒప్పందాలు 20,21 నెలల పాటు జరిగి ఒప్పంద సమయంలో రిటైర్ అయిన కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్ కోల్పోవడం, మెడికల్, ప్రమోషన్ ఇతర విషయాల్లో నష్టపోవడానికి గమనించి టిఎన్‌టియూసి, మిత్రపక్షాలు సకాలంలో వేతన ఒప్పందాన్ని పూర్తి చేసి కార్మికులందరికీ మేలు చేయడం జరిగింది. గతంలో ఒప్పందాలలో రాసిన అంశాలు పూర్తి స్థాయిలో అమలు జరిగేవి కావు, కానీ టిఎన్‌టియూసి, మిత్రపక్షాలు చేసిన ఈ 13వ వేతన ఒప్పందంలో రాసిన అన్ని పాయింట్లు పూర్తి స్థాయిలో అమలు చేస్తూ సమర్ధవంతంగా అమలు చేయడమే టిఎన్‌టియూసి, మిత్రపక్షాలకు కార్మికుల మద్దతుకు కారణంగా కనిపిస్తుంది. ప్రతి కార్మికుడికి మాట ఇచ్చిన విధంగా వేతనాలలో రూ 15వేలు పెరుగుదల సాధించడం, మెడికల్ విషయంలో గత అన్ని ఒప్పందాల కంటే మంచి పురోగతి సాధించడం, రిటైర్మెంట్ బెనిఫిట్‌ను సమూలంగా ప్రక్షాళన చేస్తూ అధిక మొత్తంలో బెనిఫిట్‌ను సాధించడం, అత్యధిక సంఖ్యలో అప్ గ్రేడ్షన్స్, గిఫ్ట్ కల్చర్ను తిరిగి ప్రవేశపెట్టడం ఇలా అన్ని విషయాలలో కార్మికులకు మంచి చేసి...మంచిని గుర్తిద్దాం మళ్లీ గెలిపిద్దాం అనే నినాదంతో ముందుకు వెళుతున్న టిఎన్‌టియూసి, మిత్రపక్షాలు గెలుపు స్పష్టంగా కనిపిస్తోంది.

సన్నరకం ధాన్యంపై మిల్లర్లు అభ్యంతరాలు తొలగించాలి

-వైరా ఆయకట్టు పరిధిలో

జనవరి చివరి వరకు కొనుగోలు కేంద్రాలు కొనసాగించాలి

-అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి రైతుల వినతి

ప్రజాపక్షం/వైరా: ప్రభుత్వం ప్రకటించిన 1262,1271 సన్న రకాల ధాన్యం కొనుగోలులో మిల్లర్లు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలు తొలగించి కొనుగోలు వేగవంతం చేయాలని కొనుగోలు కేంద్రాల్లో ఇతరర సమస్యలు పరిష్కారం చేయాలని, వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో కొనుగోలు కంప్రాలు జనవరి చివరి వరకు కొనసాగించాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళశారం ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి వైరా రైతులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లాకార్యదర్శి బొంతు రాంబాబు కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. 1262,1271 రకాల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కటాలు వేసిన వారం, పది రోజులు అవుతున్నా ధాన్యం బస్తాలు మిల్లులకు తరలించడం లేదని, గన్నీ సంచులు అవసరమైన మేరకు అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబెట్టుటకు స్థలం లేక రైతులు మరో చోట ధాన్యం ఆరబోసిన అక్కడ కూడా కటాలు వేసి రైతులపై భారం పడకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు.. వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో వరి నాట్లు ఆలస్యం కావడంతో పాటు ఎక్కువ మంది రైతులు ఇతర ధాన్యం రకాల కంటే 20 రోజుల అదనం కాలం పంట వచ్చే 1262 రకం సాగు చేశారని, జనవరి చివరి వరకు కొనుగోలు కేంద్రాలు కొనసాగించాలని వివరించారు. 1262,1271 ధాన్యం సన్న రకాల క్రింద కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, రైతు సంఘం బృందంకు రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వాసిరెడ్డి ప్రసాద్, షేక్ మీరా, వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు బాణాల శ్రీనివాసరావు, గోపవరం సొసైటీ డైరెక్టర్ సంక్రాంతి నర్సయ్య, గరికపాడు సొసైటీ డైరెక్టర్ బాణాల కృష్ణమాచారి, కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యనమద్ది రామకృష్ణ, బోడేపూడి వీరభద్రం, మాడపాటి రాజేస్ తదితరులు పాల్గొన్నారు.

మోటివేటర్‌కు జాతీయ అవార్డు

ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు బావి కూనవరం కు చెందిన ఎండి. గౌస్ పాషా (అసిస్టెంట్ ప్రొఫెసర్) పేద పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించేలా మోటివేట్ చేస్తూ, అవసరమైతే తానే ఫీజులు కడుతూ పేద పిల్లల భవిష్యత్తు కొరకు పాటు పడుతున్నందుకు గాను, సమాజ సేవ చేస్తునందుకు గుర్తింపు గా డాక్టర్ ఏ.పీ.జే అబ్దుల్ కలాం జాతీయ అవార్డు లభించింది. ఈ అవార్డులను మన రాష్ట్రంలో ముగ్గురు అందులోనూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గౌస్ పాషాకు మాత్రమే దక్కడంతో తోటి మిత్రులు మంగళవారం సన్మాన కార్యక్రమంను బావి కూనవరంలో గౌస్ పాషా ఇంటి వద్ద నిర్వహించారు.

మాజీ హోంగార్డు చారిపై చీటింగ్ కేసు నమోదు

ప్రజాపక్షం/మణుగూరు రూరల్ : మణుగూరు రూరల్ ప్రాంతానికి చెందిన మాజీ హోంగార్డు కట్కోజుల శ్రీనివాస చారి పై చీటింగ్ కేసు నమోదైంది. ఈ సందర్భంగా మణుగూరు సిఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో దళిత బంధు ఇప్పిస్తానని మణుగూరు సమితి సింగారంకు చెందిన మద్దూరి నవీన్ కుమార్ వద్ద 80 వేల రూపాయలు లంచం తీసుకున్నాడని ఆరోపణ రుజువు కావడంతో అతనిపై సోమవారం రాత్రి చీటింగ్ కేసు నమోదు చేయడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు. బాధితుడు నవీన్ డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే రేపు మాపు అని చెబుతూ కాలయాపన చేయడంతో మద్దూరి నవీన్ కుమార్ పోలీసులకు దరఖాస్తు చేసుకోవడంతో చారి పై చీటింగ్ కేసు నమోదు చేయడం జరిగింది అని తెలిపారు.

లగచర్ల రైతులపై కేసులు ఎత్తివేయాలి

ప్రజాపక్షం/మణుగూరు రూరల్: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆదేశానుసారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆధ్వర్యంలో లగచర్ల రైతులను చేతులకు బీడీలు వేసి అక్రమ కేసులతో జైల్లో పెట్టిన రైతులను వెంటనే విడుదల చేసి కేసులు ఎత్తివేయాలని కోరుతూ మంగళవారం పార్టీ కార్యాలయం నుండి మండల పట్టణ కన్వీనర్లు, కార్యకర్తలు కలిసి నిరసన వ్యక్తం చేస్తూ అంబేద్కర్ సెంటర్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ లగచర్ల రైతులను అక్రమంగా కేసులు పెట్టి జైలు కు పంపించారని అగ్రహం వ్యక్తం చేస్తూ, లగచర్ల రైతులను వెంటనే బేషరతుగా విడుదల చేసి వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పట్టణ అధ్యక్షులు కురి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, మాజీ పట్టణ అధ్యక్షులు అడపా అప్పారావు, మండల పట్టణ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

CPI(ML)న్యూడెమోక్రసీ
జూలూరుపాడు మండల కమిటి

ప్రజాపక్షం/జూలూరుపాడు : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్‌కే. ఉమర్ డిమాండ్ చేశారు. మంగళవారం జూలూరుపాడు మండ లంలోని వల్లోజీ రమేష్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్య క్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కు 6 గ్యారంటీలను అమలు చేస్తామని, పేద వాళ్ళందరికీ ఎవరి స్థలంలో వాళ్లకు ఇళ్ల స్థలాలు, ఇండ్లు ఇస్తామని ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని, ఎన్ని కష్టాలు ఎదురైనా నెరవేరుస్తామని, రైతులకు రెండు లక్షల రుణమాఫీని చేస్తామని, చెప్పిన ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో కల్తి నరసింహరావు, జాటోత్ నరసింహ, బత్తుల గోపి, జావాది నరసింహారావు, కే నరసింహరావు, కల్తీ సురేష్, ఏనుగు సీతయ్య, తెల్లం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సప్తగిరి వెంచర్‌లో విద్యుత్ షాక్‌తో కూలీ మృతి

ప్రజాపక్షం/తల్లాడ : సప్తగిరి వెంచర్‌లో విద్యుత్ షాక్‌తో వలస కూలీ మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లాకు చెందిన అలుగు వెంకటేశ్వర్లు (34) మూడు నెలల క్రితం బతుకు దెరువు కోసం తల్లాడ ప్రాంతానికి వచ్చాడు. తల్లాడ కొత్తగూడెం రోడ్డులోని సప్తగిరి రియల్ వెంచర్‌లో పనికి కుదిరాడు. కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే ఉండే వెంకటేశ్వర్లు మంగళవారం కాంక్రీట్ పని నిమిత్తం తెచ్చిన వాహనానికి విద్యుత్ తీగలు తగిలి తద్వారా వెంకటేశ్వర్లు షాక్‌కు గురయ్యాడు. పనిచేస్తున్న కూలీలు వెంటనే తల్లాడ ఆసుపత్రికి తీసుకుని రాగా ప్రథమ చికిత్స అందించి 108లో ఖమ్మం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వెంకటేశ్వర్లు తండ్రి వెంకటస్వామి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కొండలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బతుకు దెవురు కోసం వచ్చిన వెంకటేశ్వర్లు విద్యుత్ షాక్‌కు గురై మరణించడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తుంది. పిల్లలు, భార్య రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

ట్రైబల్ మ్యూజియంపై ముమ్మర ప్రచారం

- ఐటిడిఏ పిఓ రాహుల్

ప్రజాపక్షం/భద్రాచలం : రామాలయానికి వచ్చే భక్తులు స్వామి దర్శనం అనంతరం నేరుగా ట్రైబల్ మ్యూజియంకు వచ్చే విధంగా అందరి సహకరంతో ముమ్మర ప్రచారం చేసి అత్యధికంగా పర్యాటకులు వచ్చే విధంగా సన్నాహాలు చేస్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. మంగళవారం ఐటిడిఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను ఆయన సందర్శించి మ్యూజియం సుంధరీకరణ కోసం జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ పాతతరం ఇండ్ల నిర్మాణం, గుడిసెలు, వారి సంస్కృతి, సంప్రదాయాలను చూపరులకు ఆకర్షించే విధంగా చేపేడుతున్న పనులు ముగింపు దశకు చేరుకున్నాయని, సోలార్ లైట్ల విద్యుత్ కాంతాలు వెదజల్లేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆదివాసీ గిరిజనులకు సంబంధించిన వంటకాలు, పిల్లలు, పెద్దలు సరదాగా గడిపేందుకు ఆట స్థలాలు, బోటింగ్ షికారు, విలువిద్య క్రీడలకు సంబంధించిన ఏర్పాట్లు చసేసి రాత్రిపూట గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ మ్యూజియం ఖండాంతరాలకు వ్యాప్తించే విధంగా అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, ఉదయ్ కుమార్, రమణయ్య, చంగల్ రావు, హరికృష్ణ, శ్రీనివాసరావు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

లగచర్ల గిరిజన రైతులపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేయాలి

- అంబేద్కర్ విగ్రహానికి బిఆర్ఎస్ వినతి

ప్రజాపక్షం/భద్రాచలం : లగచర్ల గిరిజన రైతులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా భద్రాచలం పట్టణ కన్వీనర్ ఆకోజ్ సునీల్ కుమార్ మాట్లాడుతూ ఫార్మసిటి కోసం హైదరాబాద్ శివారు ప్రాంతంలో కేసిఆర్ 14000ఎకరాలు సేకరించి పెడితే ఇప్పుడు అది కుదరదని గిరిజన రైతాంగం సాగు చేసుకుంటున్న భూములపై కొండగల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సొంత ఫార్మాసిటి కోసం బలవంతంగా భూములు భూములు లాక్కునేందుకు కుట్ర చేశారని, తమ భూములు కాపాడుకునేందుకు ప్రయత్నం చేసిన రైతులను ఈ ప్రభుత్వం జైలు పాలు చేసిందన్నారు. లగచర్ల ఫార్మసిటి భూబాధితులకు బిఆర్ఎస్ అండగా ఉంటుందని అన్నారు. అక్రమ కేసులు బనాయించి జైళ్లలో పెట్టిన రైతులను తక్షణమే విడుదల చేయాలని,గిరిజన పేద రైతాంగం పట్ల ప్రభుత్వ నిరంకుశ వైఖరి నశించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పూర్ణచంద్రరావు, జయప్రేమ్ కుమార్, కోలారాజు, రామకృష్ణ, ఏడు కొండలు, నర్సింహాలు, నాగేశ్వరావు, రాఘవ, బాబు, దాసు, శివ, డానియేల్ ప్రదీప్ బాబి, సలోమి, ప్రియాంక, రాణి తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడులో ఓటరు నమోదుపై అవగాహన

ప్రజాపక్షం/బూర్గంపాడు : గ్రామ పంచాయితీ ఎన్నికలను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ వారి ఆదేశాల మేరకు అన్ని గ్రామాలలో బూత్ లెవన్ అధికారులు ద్వారా జరుగుతున్న స్పెషల్ సమ్మరీ ఓటర్ల నమోదు, సవరణ కార్యక్రమంలో భాగంగా బూర్గంపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు ఓటరు అవగాహన కార్యక్రమంలో ఐకెపి మహిళలతో రంగోలి ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జమలారెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. తదనంతం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యక్రమానికి విచ్చేసిన వారికి ఓటరు నమోదుపై అవగాహన కల్పించి, గ్రామాలలో ప్రజలందరికీ స్పెషల్ సమ్మరీ కార్యక్రమాల గురించి తెలియజేసి, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల పంచాయితీ అధికారి సునీల్ కుమార్, ఏపీఎం నాగార్జున్, ఏపీఓ విజయలక్ష్మి , మండల పరిషత్ టైపిస్టు మాధవి, యూడిసి రఘుకుమార్, ఐకెపి సీసీలు అరుణ, తులసి, లీలావతి, నిర్మల, రాంబాబు, పంచాయితీ కార్యదర్శి ప్రభాకర్, కంప్యూటర్ ఆపరేటర్లు సునీత, చంద్రిక, ఇతర పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

లగచర్ల రైతులకు బిఆర్ఎస్ అండగా ఉంటుంది..

ప్రజాపక్షం/ అశ్వారావుపేట : లగచర్ల రైతులకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. లగచర్ల రైతులపై అక్రమ కేసులు పెట్టడమే కాకుండా వారిపై థర్డ్ డిగ్రీ ఉపయోగించి జైల్లో పెట్టడాన్ని నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ పిలుపు మేరకు అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో మంగళవారం బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతి పత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షసపాలన నడుస్తుందని, రేవంత్‌రెడ్డి తమ కుటుంబ సభ్యులు కోసం లగచర్ల గిరిజనులను హింసను గురి చేస్తున్నారని, తమ భూములు ఇవ్వమని అంటుంటే రైతులపై అక్రమం కేసులు పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైల్లో పెట్టడం మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం దిక్కుమాలిన చర్య అన్నారు. ఒక రైతుకు గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లే క్రమంలో ఆ రైతన్నకు బేడీలు వేసి తీసుకెళ్లడం చాలా బాధాకరంగా ఉందని అన్నారు. వెంటనే గిరిజన రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి అరెస్టు అయిన వారిని విడుదల చేయకపోతే రానున్న రోజుల్లో మరిన్నీ కార్యక్రమాలు చేయాల్సి వస్తుందని, వెంటనే రైతులను విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాష్‌రావు, మాజీ ఎంపిపి జలిపల్లి శ్రీరామ్మూర్తి, మాజీ జెడ్పిటిసి జూపల్లి రమణరావు, అశ్వారావుపేట టౌన్ అధ్యక్షులు సత్యవరపు సంపూర్ణ, సుంక ప్రసాద్, మోహన్‌రెడ్డి, కాసాని చంద్రశేఖర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సర్వజ్ఞ విద్యార్థుల ప్రతిభ

NURTURING LIFELONG LEARNERS...
సర్వజ్ఞ స్కూల్
Sarvagnya
NEW GEN SCHOOL
A/C CAMPUS
NURSERY TO 10th CLASS
DAY & RESIDENTIAL
893 48202

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : సిఎం కప్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ ఆర్‌వి నాగేంద్రకుమార్ తెలిపారు. ఈనెల 11 నుంచి 13 వరకు పల్లె నుంచి ప్రపంచ స్థాయి విజేతల కొరకు సిఎం కప్ పోటీలు నిర్వహించారు. స్పోర్ట్స్ అథారిటి ఆఫ్ తెలంగాణ అండర్ 14, 17 టెన్నిస్ పోటీల్లో సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు జి. చార్విక్, షేక్ ఫజిల్ లు మొదటి స్థానాన్ని సాధించి బంగారు పతకాలను సాధించినట్లు పాఠశాల డైరెక్టర్లు నాగేంద్రకుమార్, నీలిమ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటల్లో శిక్షణిస్తూ వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు తమ పాఠశాల నిరంతరం కృషి చేస్తుందన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధనను అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా బంగారు పతకాలను సాధించిన విద్యార్థులను డైరెక్టర్లతో పాటు ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో హార్వెస్ట్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : అమెరికన్ మ్యాథ్స్ ఒలింపియాడ్ వారు ఆన్‌లైన్‌లో నిర్వహించే మ్యాథ్స్ ఒలింపి యాడ్‌లో హార్వెస్ట్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చి రెండవ రౌండ్‌కు ఎంపి కైనట్లు హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యా సంస్థల యాజమాన్యం మంగళవారం తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 8, 9, 10 తరగతుల విద్యార్థుల్లో గణిత శాస్త్రా నికి సంబంధించి ప్రతిభను వెలికితీసేందుకు గత నెల ఆరున ఆన్‌లైన్‌లో నిర్వహించిన మ్యాథ్స్ ఒలింపియాడ్ మొదటి రౌండ్‌లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రెండవ రౌండ్‌కు ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. తమ పాఠశాలకు చెందిన ఎస్‌కె రియాన్ అరాఫత్, టి. శ్రిజిత్, కె. రిషిత్ , ఎన్.రుష్యేంద్రమణి, ఎం. జయరాం రెండవ రౌండ్‌కు ఎంపికైనట్లు తెలిపారు. రెండవ రౌండ్‌కు ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ పి. రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్. పార్వతిరెడ్డి లు అభినందించారు. భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలను సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఐటి బ్రాంచ్ ఇంచార్జిలు జి. ఉమామహేశ్వరరావు, కె. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు త్రివేణి విద్యార్థిని

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు త్రివేణి పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎన్. సంధ్య ఎంపికైంది. ఖమ్మం సర్దార్ పటేల్ మైదానంలో జరుగుతున్న సిఎం కప్ ఎస్‌జిటి కరాటే పోటీల్లో త్రివేణి పాఠశాలకు చెందిన ఎన్. సంధ్య మొదటి బహుమతి గెలుచుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. మంగళవారం పాఠశాలలో జరిగినకార్యక్రమంలో త్రివేణి పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి, త్రివేణి, కృష్ణవేణి విద్యా సంస్థల అధినేత యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్‌వో కాట్రగడ్డ మురళి కృష్ణ, ప్రిన్సిపాల్ పి. రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తపా తదితరులు రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినిని అభినందించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపి పాఠశాలకు, జిల్లాకు ఖ్యాతిని తీసుకుని రావాలని వారు ఆకాంక్షించారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ళ సర్వే

ప్రజాపక్షం/భద్రాచలం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా అందించనున్న ఇందిరమ్మ ఇళ్లకు డివిజన్ వ్యాప్తంగా పెద్ద ఎత్తున సర్వే జరుగుతోంది. ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తు చేసుకుని ఆన్‌లైన్ ఆయిన వారి పేర్లతో పాటు సిబ్బంది ఇంటింటికీ తిరిగి పరిశీలించి సర్వే నిర్వహిస్తూ అప్పటికప్పుడు డిజిటల్ నమోదులు చేస్తున్నారు. అర్హులైన వారిని ఇంటి ముందు నిల్చుండబెట్టి ఫొటోలు తీస్తు అప్‌లోడ్ చేస్తున్నారు. ఇంటి స్థలం ఉండి, లేదా గుడిసె, రేకులు ఇళ్లు ఉన్న వారికి తొలి దఫా ఇళ్లు వస్తాయని సిబ్బంది చెబుతూ ప్రజలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నారు.

వైరా బస్టాండ్‌లో కొరవడిన నిఘా నేత్రం..!

-ఆకతాయిల ఆగడాలతో ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు
-మద్యం మత్తుతో బైకులపై బస్టాండ్‌లోకి వచ్చి బాలికల పట్ల అసభ్య ప్రవర్తన
-ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు
-షీటీమ్ బృందాలు ఎక్కడ..?

ప్రయాణ ప్రాంగణము - వైరా

SWARNA BHARATHI

ప్రజాపక్షం/వైరా: వైరా ఆర్‌టిసి బస్టాండ్‌లో నిఘా పర్యవేక్షణ కొరవడిందని చెప్పవచ్చును. ఒకప్పుడు వైరా ఆర్‌టిసి బస్టాండ్‌లో ఉదయం సాయంత్రం పూట మధ్యాహ్నం సమయంలో కూడా కొన్ని సందర్భాల్లో పోలీసులు మఫ్టిలో విధులు నిర్వహించిన సందర్భాలు ఉన్నాయి. కాని ఇప్పుడు ఆర్‌టిసి బస్టాండ్‌లో ఆ పరిస్థితి కనిపించడం లేదని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత మూడు రోజుల క్రితం మధిర రెండు ద్విచక్ర వాహనాలు వేసుకొని వచ్చి మద్యం మత్తులో బాలిక పట్ల అసభ్యతంగా ప్రవర్తించారనే తీరు ప్రతినోటా చర్చనీయాంశంగా మారింది. వైరా బస్టాండ్‌లో ఉదయం సాయంత్రం పూట పాఠశాలలు కాలేజీలు ప్రారంభమయ్యే సమయంలో సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో ఆకతాయిల బెడద విద్యార్థులను తీవ్రంగా వేధిస్తుంది. ముఖ్యంగా పాఠశాలల నుంచి వచ్చే రోడ్లపై బైకులతో కటింగ్ ఇస్తూ వెర్రిచేష్టలతో ఆందోళనలకు గురి చేస్తున్నారు. చెప్పుకోలేని పరిస్థితిలో పలువురు విద్యార్థినిలు వారు మనోవేదన గురవుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా కొంతమంది ప్రత్యేకంగా పసిగట్టుకొని ఉదయం సాయంత్రంపూట బస్టాండ్ ఏరియాలో రద్దీగా ఉన్న విద్యార్థులు ఉన్న ప్రాంతంలో తిరుగుతూ రకరకాల మాటలతో ఇబ్బందులు గురి చేస్తున్నట్లు సమాచారం. ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి. ఆర్‌టిసి బస్టాండ్‌లో మఫ్టీలో తిరరగే షీటీమ్ బృందాలు కూడా కనిపించడం లేదు. అసలు షీటీమ్ బృందాలు ఉన్నట్లా లేనట్లా అనేది కూడా అర్థం కాని పరిస్థితి. గతంలో వైరా ఆర్‌టిసి బస్టాండ్‌లో పోలీస్ నిఘా గట్టిగా ఉండేది. కాని ప్రస్తుతం ఆ నిఘా కనిపించడం లేదు. దీంతో ఆకతాయిలు ఆగడాలు రోజురోజుకు మితిమించిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని వైరా ఆర్‌టిసి బస్టాండ్ షీటీమ్ బృందాలు పోలీస్ పరిరక్షణ ఉండేవిధంగా చూసి మఫ్టీలో పోలీస్ బృందాలు తిరిగితే ఆకతాయిలో ఆట కట్టచేవచ్చు అని పలువురు ప్రజలు కోరుకుంటున్నారు. బస్టాండ్ ఎదురుగా పాత కూరగాయల మార్కెట్ రోడ్డులో ఎక్కువ సంఖ్యల విద్యార్థులు నడిచిపోతూ ఉంటారు. ఆ ప్రాంతంలో ద్విచక్ర వాహనాలతో చక్కెరలు కొడుతూ కటింగ్ ఆకతాయిల ఆగడాలు జరుగుతున్నా. వాళ్ళ ఆగడాలు చూస్తూ ఉంటే ఎక్కవ ఎలాంటిప్రమాదం జరిగిద్దో అని ప్రజలు భయపడాల్సిన పరిస్థితి కూడా ఏర్పడింది. ఇప్పటికైనా ఆకతాయిలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సిఆర్‌టిల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలి

ప్రజాపక్షం/ఏన్కూరు: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న సిఆర్‌టిల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్.నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల మూలపోచారంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో సిఆర్‌టిలకు సంఘాభావంగా నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిఆర్‌టిల నిరవధిక సమ్మెకు టిఎస్‌యుటిఎఫ్ సంపూర్ణ మద్దతు సంఘీభావం తెలియజేస్తుందని ఆయన అన్నారు. 20 ఏళ్లుగా గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తూ ఏదో ఒకరోజు జీవితంలో మంచి రోజులు వస్తాయని ఆశిస్తున్నా సిఆర్‌టిల పరిస్థితి రోజురోజుకు వారి పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. చాలిచాలని జీతాలతో కుటుంబాన్ని గడపడం చాలా కష్టమవుతుందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళుతెరిచి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, మినిమం టైస్కేలు ఇవ్వాలని, బకాయి పడిన వేతనాలను వెంటనే చెల్లించాలని, ప్రతినెల 1వ తారీఖున గ్రీన్‌చానల్ ద్వారా వేతనాలు ఇవ్వాలని ఆయన కోరారు. సిఆర్‌టి మహిళా ఉపాధ్యాయులకు వేతనంతో కూడిన 180 రోజులు ప్రసూతి సెలవులను మంజూరు చేయాలని, 61 సంవత్సరాలు నిండిన సిఆర్‌టిలకు రూ.20లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రామ్‌చంద్, ఎం.పుల్లయ్య, శ్రీదేవి, సింగ్యా, శ్రీరాం, జె.నాగేశ్వరరావు, రమేష్, చందర్‌రావు, ఉషశ్రీ, సౌందర్య, కాంతయ్య, హరియానాయక్, కపూరియా తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ పెస్ట్ సర్వే లైస్ సిస్టం వ్యాప్ యాప్‌పై అవగాహన

ప్రజాపక్షం/వైరా: వైరా మండలం ఖానాపురం రైతువేదిక నందు మంగళవారం రైతునేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ రైతునేస్తం కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దాసరి పుల్లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమగ్ర సస్యరక్షణ పంటల పరిరక్షణ గురించి రైతులకు వివరించారు. అనంతరం నేషనల్ పెస్ట్ సర్వే లైన్ సిస్టం మొబైల్ వ్యాప్ గురించి రైతులకు వివరించారు. ఈ యాప్ ద్వారా పంటల సంరక్షణ గురించి తెలుసుకోవచ్చని చీడపీడలను గుర్తించి వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను శాస్త్రవేత్తలు వివరించడం జరుగుతుంది. వరి కోయలు కాల్చవద్దని, ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం వ్యవసాయ అధికారుల ద్వారా పెద్ద ఎత్తున విస్తృతంగా ప్రచారం నిర్వహించడం జరిగిందని ఆయన కొంతమందికి రైతులు మూర్ఖంగా వరికొయ్యలు కాల్చుతున్నారని, అలా కాల్చడం వలన భూసాంద్రత కోల్పోతుందని వరికొయ్యలు మురగపెట్టి కలియదున్నితే పొలానికి బలం చేకూరుతుందని తెలిపారు. అనంతరం పూసలపాడు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి దాసరి పుల్లయ్య, పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందరర్భంగా దాసరి పుల్లయ్య మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజు ఖాన్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సపవత్ సైదులు, పరిటాల వెంకటనర్సయ్య, మేడా రాజేష్, వెంపటి కీర్తి, రైతులు లాల్‌మహ్మద్, మౌలాలి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల చిత్రపటాల బోర్డులు ఏర్పాటు

ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్: సింగరేణి విద్యా సంస్థల్లో విద్యార్థులకు దేశంలో గొప్ప మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధులు, శాస్త్రవేత్తలు,క్రీడాకారులు, కళలు, సంగీతం, చిత్ర పరిశ్రమ వంటి వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన గొప్ప వ్యక్తులకు సంబంధించిన వివరాలు తెలియజేసి విద్యార్థుల పరిజ్ఞానాన్ని పెంచి స్ఫూర్తిని పెంపొందించుటకై ఫోటోలు ఏర్పాటుచేయడం జరిగింది. విద్యార్థులు ఈ యొక్క బోర్డ్‌లను ఆసక్తికరంగా తిలకిస్తూ వారి గురించి తెలుసుకోవడం వలన విద్యార్థులకు మేధాశక్తి పెరుగుతుంది అన్నారు. ఇలా ఏర్పాటుచేయడం చాలా ఉపయోగకరంగా ఉందని ఉపాధ్యాయులు అన్నారు. ఈ యొక్క బోర్డులను మెడికల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ప్రభుదయాళ్, జిల్లా సైన్స్ ఆఫీసర్ చలపతిరావు వీక్షించి ఇలా బోర్డుల ద్వారా మహనీయుల గురించి విద్యార్థులకు తెలియజేసే ఈ యొక్క మంచి కార్యక్రమాన్ని కొనియాడారు. ఇలాంటి చిత్ర ప్రదర్శన అన్ని పాఠశాలలో ఏర్పాటు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిట్యాల పుల్లయ్యకు నివాళి

ప్రజాపక్షం/వైరా: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు , మండల బిసి సెల్ అధ్యక్షులు చిట్యాల పుల్లయ్య మంగళవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారరు. చిట్యాల పుల్లయ్య పార్దివదేహానికి తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు వాసిరెడ్డి రామనాధం నియోజకవర్గ ఇంచార్జి చెరుకూరి చలపతిరావు, వైరా మండల అధ్యక్షులు, కిలారు సురేందర్, పట్టణ అధ్యక్షులు మన్నేపల్లి ప్రదీప్, తెలుగు యువత అధ్యక్షులు నూకవరపు అయ్యప్పచౌదరి, మదడపు మధుసూదన్‌రావు, వెంకటేశ్వరరావు, మేదరమెట్ల పూర్ణ చంద్రరావు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీకి సేవలందిస్తూ పార్టీ కృషికి బలోపేతానికి ఎంతో కృషి చేసిన చిట్యాల పుల్లయ్య ఆకస్మిక మరణం బాధాకరమని తెలుగుదేశం పార్టీ ఒక మంచి కార్యకర్తను కోల్పోయిందని వారు అన్నారు. అనంతరం పుల్లయ్య కుటుంబ సభ్యులను తెలుగుదేశం పార్టీ నాయకులు పరామర్శించి ఓదార్చారు.

మాస్టర్ డేటా సైన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన ఒక సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన వెన్నపూస వేణుగోపాల్‌రెడ్డి అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్‌లో మాస్టర్ డేటా సైన్స్ పూర్తి చేసి అవార్డు తీసుకున్నారు. యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డికి మాస్టర్ డేటా సైన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా సోమవారం అవార్డును కాలేజి సిబ్బంది అందించినట్లు తండ్రి వెన్నపూస కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తన కుమారుడు 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు బనిగండ్లపాడు వివేకానంద స్కూల్‌లో, 6, 7 తరగతులు మైలవరం ఎస్ఎస్ పబ్లిక్ స్కూల్‌లో, 8, 9, 10 తరగుతులు విజయవాడ నారాయణలో చదవి పదవ తరగతిలో పదికి పది జిపిఎ సాధించినట్లు, ఇంటర్ ఖమ్మం హార్వెస్టర్ కాలేజిలో, బిటెక్ చెన్నైలోని సత్యభామ యూనివర్సిటీలో చదివినట్లు తెలిపారు. వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తన తల్లిదండ్రుల ఆశయాలకనుగుణంగా ఉన్నత విద్య అభ్యసించి మాస్టర్ డేటా సైన్స్‌లో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. తన తదుపరి లక్ష్యం ఇంకా ఉన్నత చదువులు చదవాలని, తనకు అన్ని విధాలుగా సహకరించిన తన తల్లిదండ్రులకు, సహకరించిన గురువులు, మిత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : మండల పరిధిలోని హైదర్ సాయిపేట గ్రామంలో విద్యుత్ షాక్ తో ఆవు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం హైదర్ సాయి పేట గ్రామానికి చెందిన భూక్య చంద్రబాన్ కొంత వ్యవసాయ పొలం ఉండగా ఇటీవల పొలం కోత కోయగా ఆ మడికట్లలో ఆవు మేత కోసం వెళ్లి విద్యుత్ షాక్ గురై మృతి చెందింది హైదర్ సాయి పేట సబ్ స్టేషన్ పరిధిలోని వ్యవసాయ బావుల బోర్ల మోటార్లకు అందించే విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వద్ద ఆవు మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే ఆవు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సంఘటనతో రైతు భూక్య చంద్రబాన్ కన్నీరు పెట్టుకొని విలపించాడు. ఆవు ధర సుమారు 50 వేల రూపాయలు ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆవు మృతి చెందిన సంఘటనను తెలుసుకున్న విద్యుత్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

ఓటర్ల జాబితా విడుదల

ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశానుసారం తిరుమలాయపాలెం మండలంలోని 40 గ్రామ పంచాయతీలలో వార్డుల వారిగా గ్రామపంచాయతీ ఎలక్ట్రోరల్ రోల్స్ తుది జాబితాను జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ ఆదేశాల మేరకు మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సిలార్ సాహెబ్, ఎంపీఓ సూర్యనారాయణ నూతన ఓటర్ జాబితాను విడుదల చేశారు.అన్ని గ్రామపంచాయితి కార్యాలయాల్లో ఓటరు జాబితాను ప్రజల సందర్శన కోసం ప్రదర్శించారు. కాగా కొత్తగా ఓటు హక్కు పొందిన 678 ఓటర్లతో కలిపి తిరుమలాయపాలెం మండలంలో మొత్తం 50 వేల 458 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 24 వేల 370, స్త్రీలు 26 వేల 088 మంది ఉన్నారు.మండలంలో పురుషుల కంటే మహిళ ఓటర్లు 1718 మంది అధికంగా ఉన్నారు. ఇదిలా ఉండగా మండల వ్యాప్తంగా 40 గ్రామ పంచాయితీల్లో మొత్తం 356 వార్డులు ఉండగా 56 బూత్ లుగా విభజించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మీరా,కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.